సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 14 । నవంబర్ । 2023



కూరగాయలకు గిరాకీ

పెదబయలు వారపు సంతలో సోమవారం ఒడిశా కూరగాయల అమ్మకం ఎక్కువగా జరిగింది. 8లో



భక్తిశ్రద్ధలతో..

స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం నృసింహ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 8లో



పుస్తకం విలువ చాటేలా..!

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. 8లో

న్యూస్‌రీల్

టూరిజం కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



టూరిజం కార్మికులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

అరకులోయటౌన్: టూరిజం కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న కార్మికులతో సోమవారం ఆయన చర్చలు జరిపారు. సమాన పనికి సమాన వేతనం, పదోన్నతికి సంబంధించిన అంశాలపై వచ్చే నెల 31లోగా చర్యలు తీసుకుంటామని, ఇతర డిమాండ్లపై మార్చి 31లోగా ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని పీవో తెలిపారు. చర్చలు జరుగుతుండగా వేరే ప్రాంతం నుంచి ఇక్కడ పనిచేసేందుకు టూరిజం అధికారులు కొంతమంది కార్మికులను తీసుకురావడంతో స్థానిక కార్మికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. మంగళవారం ఉదయం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి చర్చిద్దామని తెలిపి పీవో వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గంగరాజు, వి.బాబూరావు, అల్లూరి జిల్లా టూరిజం కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.వి.నారాయణరావు, వి.అంజలిరావు, కార్మికులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో రాజవొమ్మంగి విద్యార్థినికి సీటు



పవిత్ర

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగికి చెందిన ముప్పన పవిత్ర ప్రతిభ కనబరచి ఎయిమ్స్ (ఢిల్లీ)లో సీటు సంపాదించి మన్యానికి పేరు తెచ్చారు. తన కుమార్తె ఆల్ ఇండియా ర్యాంకింగ్‌లో 304 స్థానం కైవశం చేసుకుందని తండ్రి అమర్‌నాథ్ తెలిపారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పవిత్ర ఎంబీబీఎస్ పూర్తి చేశారు. పవిత్ర మాట్లాడుతూ గైనకాలజీలో ఎండీ పూర్తి చేయాలన్నది తన లక్ష్యమని తెలిపారు.

సీలేరులో విదేశీయుల సందడి



గిరిజనులతో విదేశీయులు

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో సోమవారం విదేశీయులు సందడి చేశారు. యూసీఐఎం చర్చ్ అధినేత కేఆర్ సింగ్ ఆహ్వానం మేరకు 17మంది విదేశీయులు ఇక్కడికి వచ్చారు. ముందుగా గిరిజన సంప్రదాయాలతో వారికి స్వాగతం పలికారు. ప్రార్థన అనంతరం గిరిజనులతో కొంతసేపు ముచ్చటించారు. గిరిజన ఆచార సంప్రదాయలను అడిగి తెలుసుకున్నారు. మన్యం అందాలు అద్భుతంగా ఉన్నాయని వారు చెప్పారు. విదేశీయుల రాకతో సీలేరులోని సందడి వాతావరణం నెలకొంది. పాస్టర్లు మనష్షే, స్టాన్లీ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

రద్దయిన రైళ్లు

ఈ నెల 19న విశాఖపట్నం- రాయగడ (08504) పాసింజర్ స్పెషల్, 20న రాయగడ-విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్, 20న విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం (08546 / 08545) పాసింజర్ స్పెషల్ రైళ్లు ఇరువైపులా, 20న విశాఖపట్నం- కోరాపుట్ (18512) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్, 21న కోరాపుట్ -విశాఖపట్నం(18511) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

ఈ నెల 16న హౌరాలో 8.30 గంటలకు బయల్దేరాల్సిన హౌరా- సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ఉదయం 11.05 గంటలకు బయల్దేరుతుంది. ఈ నెల 15న బెంగళూరులో ఉదయం 10.35గంటలకు బయల్దేరాల్సిన బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.35గంటలకు బయల్దేరుతుంది.

- ఈ నెల 18వ తేదీన యశ్వంత్‌పూర్-పూరీ (22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ వయా గుత్తి ఫోర్ట్, యర్రగుంట్ల, మీదుగా ప్రయాణిస్తుంది.

అన్నదాతకు అండగా..

- ఐదేళ్లుగా రైతుభరోసా అమలు
- రైతుకు వెన్నుదన్నుగా జగన్ సర్కారు
- ఎంతో భరోసా అంటున్న రైతులు



కూనవరం మండలంలో ఏపుగా పెరిగిన వరిపంట



రైతులకు ఈ ఏడాది రైతుభరోసా చెక్కును అందిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ (ఫైల్)

చింతూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అన్నదాతలకు అండగా ఉంటోంది. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయాల్లో వెంటనే ఆదుకుంటోంది. గతంలో ప్రభుత్వాలు రైతుల గురించి పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకోసం పలు పథకాలు అమలు చేశారు. అదే కోవలో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి... కష్టాల్లో ఉన్న రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అన్నదాతకు రైతు భరోసాను దిగ్విజయంగా అందజేస్తూ రైతు పక్షపాతిగా నిలిచారు.

వరంగా రైతు భరోసా

తాను అధికారంలోకి వస్తే నవరత్నాల్లో భాగంగా రైతుభరోసా అమలు చేస్తానని వైఎస్ జగన్ రైతులకు హామీఇచ్చారు. అధికారంలోకి రాగానే కరోనా సమయంలో సైతం రైతుభరోసా అందించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. విత్తనం నాటిన నుంచి పంట విక్రయం వరకు ప్రతిఏటా మూడు విడతలుగా ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా తమకు వరంలా మారిందని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా- పీఎం కిసాన్ పథకం కింద ఏడాదికి రూ.13,500 చొప్పున రైతులకు అందుతోంది. అల్లూరి జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు రైతుభరోసా కింద రూ.1067.435 కోట్లు అందజేయగా, మరో విడత సొమ్ము అందచేయాల్సి ఉంది. ఈ ఏడాది జిల్లాలోని 22 మండలాల్లో 1,70,835 మంది రైతులకు రెండు విడతల్లో 200.700 కోట్లను రైతుభరోసా కింద అందజేశారు.

అదునులో ఆదుకునేలా..

పట్టాదారు రైతులే కాకుండా కౌలురైతులు, పోడు హక్కులు కలిగిన గిరిజన రైతులకు సైతం జిల్లాలో రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం కాగానే రైతులకు ప్రధానంగా పెట్టుబడి సాయం కావాల్సి ఉంటుంది. దీంతో తొలివిడత రైతుభరోసా నగదు రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు పంటలు వేసేందుకు ఉపయోగపడుతోంది. పంటలు ఏపుగా పెరిగిన దశలో ఎరువులు, పురుగుమందుల వినియోగానికి రెండోవిడత రైతుభరోసా సాయం అక్కరకు వస్తుండగా, పంటలు కోసి విక్రయాలు జరిపేందుకు మూడోవిడత సాయం రైతులకు కొండంత ధైర్యాన్ని ఇస్తోంది.

రైతు భరోసా వివరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య	నగదు (రూ.కోట్లలో)
2019-20	1,58,122	211.633
2020-21	1,59,627	214.392
2021-22	1,60,126	216.170
2022-23	1,63,118	224.540
2023-24 (రెండు విడతల్లో)	1,70,835	200.700
మొత్తం 1,067.435 కోట్లు		

రెండు విడతలు పూర్తి

పేద రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసాతో వారికి ఎంతో మేలు జరుగుతోంది. ప్రతిఏటా క్రమం తప్పకుండా మూడు విడతలుగా నగదును రైతుల ఖాతాల్లో జమచేస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటికే రెండు విడతలు జమ చేయగా మరో విడత జమ చేయాల్సి ఉంది.

-ఎస్‌బీఎస్ నంద్, జిల్లా వ్యవసాయాధికారి

ఏటా ఇస్తున్నారు



గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా రైతుభరోసా అందిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే రెండు విడతలు రైతుభరోసా నగదు జమ అయింది.

- తోకల రమణయ్య, రైతు, కారంగూడెం, చింతూరు మండలం

ఎంతో ఉపయోగం



ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా సొమ్ము మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నాం.

- నవలం కిష్టమ్మ, మహిళా రైతు, చూటూరు, చింతూరు మండలం

హర్షణీయం



పేద రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం రైతుభరోసా అందించడం హర్షణీయం. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న మాకు ఈ సొమ్ములతో ఎంతో మేలు జరుగుతోంది.

-శ్యామల తిరుపతమ్మ, మహిళా రైతు, చిడుమూరు, చింతూరు మండలం



పాడేరు మోదకొండమ్మ ఆలయంలో...



దీపారాధన చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

• ఆనంద కాంతులు

వెలుగులు విరబూసే కాకరపువ్వొత్తులు, మతాబులు, ఆకాశాన్ని అంటేలా జువ్వున పైకి ఎగిరే తారజువ్వలు, భీకర శబ్దాలతో పేలిన బాంబులను..చూస్తూ.. కాలుస్తూ పెద్దలు పిల్లలై, పిల్లలు సీమటపాకులై కేరింతలు కొట్టే వేళ గడపగడపలో సంతోషాల కాంతులు విరబూశాయి. దీపావళి పండగను ఆబాలగోపాలం ఆనందంగా జరుపుకొన్నారు. ఆత్మీయంగా మిఠాయిలు పంచుకుని, నోరు తీపి చేసుకుని, జీవితాలు మధురంగా సాగాలని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. -9లో



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నరసింగరావు దంపతులు

కోయంబత్తూర్-పోదనూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: కోయంబత్తూర్-బరౌని -పోదనూర్ మధ్య అన్ రిజర్వ్‌డ్ స్పెషల్స్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. కోయంబత్తూర్-బరౌని (06059) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ కోయంబత్తూర్‌లో ఈనెల 14,21 తేదీల్లో రాత్రి 11.50 గంటలకు బయల్దేరి 15,22 తేదీల్లో మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి ఈ నెల 16, 23 తేదీల్లో మధ్యాహ్నం 1గంటకు బరౌని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరౌని-పోదనూర్(06060) అన్‌రిజర్వ్‌డ్ స్పెషల్ ఈ నెల 16,23 తేదీల్లో బరౌనిలో రాత్రి 11.45 గంటలకు బయల్దేరి 18,25 తేదీల్లో తెల్లవారు 3.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4 గంటలకు బయల్దేరి 19,26 తేదీల్లో తెల్లవారు 2.45 గంటలకు పోదనూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు 15-జనరల్ సెకండ్ క్లాస్, 2-చెయిర్‌కార్ సెకండ్ క్లాస్, 2-సెకండ్ క్లాస్ కం లగేజి కం దివ్యాంగ్ కోచ్‌లతో నడుస్తాయి.

అరకులో రాష్ట్ర గవర్నర్ పర్యటన రేపు

- వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర, జన జాతీయ గౌరవ్ దినోత్సవాన్ని ప్రారంభించనున్న నజీర్
- ఏర్పాట్లు పరిశీలించిన పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



అధికారులకు సూచనలు ఇస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో ఈనెల 15వ తేదీ బుధవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పరిశీలించారు. క్రీడా పాఠశాల సమీపంలోని హెలిప్యాడ్ మైదానంలో సమావేశం జరగనున్న స్థలాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించి, ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ జార్ఖండ్‌లో జనజాతీయ గౌరవ్ దివాస్, వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని, ఆ కార్యక్రమాన్ని ఇక్కడ గవర్నర్ ప్రారంభించనున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించేందుకు మూడు వాహనాలతో జిల్లాలో ప్రచారం నిర్వహిస్తారని, ఆ వాహనాలను గవర్నర్ అరకులోయలో జెండా ఊపి ప్రారంభిస్తారని చెప్పారు.

గవర్నర్ వేదిక వద్దకు చేరుకోగానే గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై కార్నివాల్ నిర్వహిస్తామన్నారు. ఆ తరువాత గవర్నర్ మొక్కలు నాటడంతో పాటు, వివిధ స్టాళ్లను ప్రారంభిస్తారన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, డీడీ ఐ.కొండలరావు, ఏఈఈ అభిషేక్, గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్తీకాన శివరూపం.. కమనీయం ఆ దర్శనం

- భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు ప్రారంభం
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



మత్స్యలింగేశ్వరస్వామికి కార్తీకమాస తొలిపూజ చేస్తున్న అర్చకుడు



ఆకాశదీపం కడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు

సాక్షి,పాడేరు: కార్తీక మాసం ప్రారంభం రోజున శివుని దర్శించుకున్న భక్తులు పారవశ్యంతో అలౌకికానందం పొందారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శివాలయాల్లో పవిత్ర కార్తీకమాస పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే భక్తులంతా తమ దగ్గరలో ఉన్న శివాలయాలకు చేరుకుని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఆధ్యాత్మిక,పర్యాటక ప్రాంతమైన హుకుంపేట మండలంలోని మత్స్యగుండం క్షేత్రంలో మత్స్యలింగేశ్వరస్వామి ఆలయంలో గిరిజన అర్చకులు శివలింగానికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. మత్స్యగుండానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అరకులోయలోని భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి ఆలయం, అనంతగిరి మండలంలోని బొర్రాగుహలు, కాశీపట్నం, జి.మాడుగుల సంతబయలు, అంతర్ల శివాయాల్లోను కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి. పాడేరు పాతబస్టాండ్‌లోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం, ఐటీడీఏ పీవో బంగ్లా ఎదుట ఉన్న స్వయం భూ త్రిలింగేశ్వరస్వామి ఆలయం, పాతపాడేరు,లగిశపల్లి, వంజంగి, గెడ్డంపుట్టు, తామరాపల్లి, తురాయిమెట్ట,వంతాడపల్లి శివాలయాల్లో కార్తీకమాస పూజలను ఘనంగా ప్రారంభించారు.

ఘనంగా ఆకాశదీపం పూజలు

పాడేరు పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి కార్తీకమాసం ఆకాశదీపం పూజలను ఘనంగా నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరసింగరావు దంపతులతో పాటు ఇతర భక్తులు ఆకాశదీపాలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు రామం పంతులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు వుప్పల వెంకటరత్నం, కొట్టగుళ్లి రామారావు, కొట్టగుళ్లి పోతురాజులు పాల్గొన్నారు.



పాడేరులో ఉమానీలకంఠేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రాత్రి విమానాలకు బ్రేక్

- రేపటి నుంచి మార్చి 31 వరకు విశాఖ ఎయిర్‌పోర్టులో రీ-సర్ఫేసింగ్ పనులు
- రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు రన్‌వే మూసివేత
- అందుకనుగుణంగా విమానాల వేళల్లో మార్పులు
- కేవలం మూడు విమాన సర్వీసులే రద్దు
- విమానయాన సంస్థల వింటర్ షెడ్యూల్ ఖరారు



విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం అర్ధరాత్రి నుంచి నాలుగున్నర నెలలు రాత్రి వేళ విమాన సర్వీసులు నిలిచిపోనున్నాయి. ఆ సమయంలో 11 గంటల పాటు విమానాల రాకపోకలు రద్దు కానున్నాయి. ఈ ఎయిర్‌పోర్టు నావికాదళం ఆధీనంలో ఉంది. నేవీ యుద్ధ విమానాలు, ఎయిర్‌క్రాఫ్టులు ఐఎన్‌ఎస్ డేగా నియంత్రణలోని రన్‌వే నుంచే కార్యకలాపాలు సాగిస్తుంటాయి. పౌర విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లు కూడా ఈ రన్‌వే మీదుగానే జరుగుతుంటాయి. రక్షణశాఖ పదేళ్లకోసారి తమ రన్‌వేలకు రీ-సర్ఫేసింగ్ పనులు చేపడుతుంది. ఈ ప్రక్రియలో రన్‌వేపై మూడు పొరలను తొలగించి మళ్లీ కొత్తగా వేస్తారు. ఇంకా అవసరమైన ఇతర పనులు చేపడతారు. ఇంతకుముందు ఐఎన్‌ఎస్ డేగాలో 2009లో రీ-సర్ఫేసింగ్ నిర్వహించారు. 2019లో మరోసారి నిర్వహించాల్సి ఉన్నా వివిధ కారణాలతో ఇప్పటివరకు జరగలేదు. ఈ ఏడాది రీ-సర్ఫేసింగ్‌ను నవంబరు 15 నుంచి మార్చి నెలాఖరు వరకు చేపట్టాలని రక్షణ శాఖ నిర్ణయించింది. ఈ పనులను రాత్రి 9 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు చేస్తారు. అందువల్ల ఆ సమయంలో ఈ రన్‌వేను మూసివేస్తారు. దీంతో ఈ 11 గంటల్లో ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలను నిలిపివేస్తారు. ప్రస్తుతం ఈ విమానాశ్రయం నుంచి రోజూ 30 వరకు టేకాఫ్‌లు, 30 ల్యాండింగులు జరుగుతున్నాయి. రీ-సర్ఫేసింగ్‌తో 12 విమాన సర్వీసులు రద్దవుతాయని తొలుత భావించినా సర్దుబాట్లు అనంతరం మూడు (ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు) విమాన సర్వీసులే రద్దయ్యాయి

షెడ్యూల్ వేళల మార్పు

రీ-సర్ఫేసింగ్ నేపథ్యంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే విమానాల వేళలను సర్దుబాటు చేసుకోవాలని సంబంధిత విమానయాన సంస్థలకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఇదివరకే సమాచారం అందించింది. దీంతో ఆయా సంస్థలు తమ విమానాల వేళల మార్పుతో పాటు వింటర్ షెడ్యూలు ఖరారు చేసుకున్నాయి. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు ఒక్కటే నడుస్తోంది. ఈ విమానం రోజూ రాత్రి 10 గంటలకు విశాఖ వచ్చి 11 గంటలకు బయలుదేరుతుంది. నవంబరు 15 తర్వాత నుంచి ఈ విమానం మూడు గంటలు ముందుగా రాత్రి ఏడు గంటలకే వచ్చి ఎనిమిది గంటలకు వెళ్తుంది. దీంతో పాటు చెన్నై, ఢిల్లీ, బెంగళూరు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, హైదరాబాద్, కడప, కోల్‌కతా, గోవా, జైపూర్, పోర్టుబ్లెయిర్, పూణే నుంచి వచ్చి, వెళ్లే దేశీయ విమాన సర్వీసులు కూడా తమ షెడ్యూల్ సమయాన్ని అరగంట నుంచి మూడు గంటల వరకు సర్దుబాటు చేసుకున్నాయి.

పర్యాటక సీజన్ వేళ

ఏటా పర్యాటక సీజన్ ఆరంభమయ్యే అక్టోబర్ నుంచి విశాఖకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. నాలుగైదు నెలల పాటు విమానాలకు పర్యాటకుల తాకిడి కొనసాగుతుంది. సాధారణంగా వింటర్ సీజన్‌లో పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు తమ షెడ్యూళ్లను పెంచుతుంటాయి. కానీ ఈ ఏడాది వింటర్ పీక్ సీజన్‌లోనే రీ-సర్ఫేసింగ్ పనులు మొదలవుతుండడంతో ఎక్కువ విమాన సర్వీసులు రద్దవుతాయని పర్యాటకులు ఆందోళన చెందారు. కానీ మూడు విమాన సర్వీసులే రద్దు కావడంతో ఒకింత ఊరట కలగనుంది.

సమయాన్ని తగ్గించాలని కోరినా..

విశాఖ ఎయిర్‌పోర్టులో రాత్రి 9 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు రన్‌వే మూసివేత సమయాన్ని తగ్గించాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, జీవీఎల్ నరసింహారావు తదితరులు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కార్యదర్శి గిరిధర్‌లతో పాటు తూర్పు నావికాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్‌కు విజ్ఞప్తి చేశారు. కానీ రక్షణ రంగ కార్యకలాపాలు, ప్రయాణికుల భద్రత, సౌలభ్యం దృష్ట్యా అది సాధ్యం కాదని ఈఎన్‌సీ చీఫ్ స్పష్టం చేశారు. అయితే పగటి పూట మరిన్ని విమానాలు నడవడానికి టైం స్లాట్లు అందుబాటులో ఉన్నాయని, ఇందుకోసం ఏటీసీలో మరింత మంది సిబ్బందిని పెంచడానికి సిద్ధమని చెప్పారు. దేశంలోని ఇతర విమానాశ్రయాల్లో కంటే విశాఖ ఎయిర్‌పోర్టు రీ-సర్ఫేసింగ్‌కు ఎక్కువ సమయం తీసుకోవడానికి సమాంతర ట్యాక్సీ ట్రాక్ లేకపోవడమేనని రక్షణశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా రీ-సర్ఫేసింగ్‌కు అసరమైన కసరత్తు పూర్తయిందని, ఇప్పటికే ట్రయల్ రన్ కూడా నిర్వహించారని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

జెండా కొండపై పర్యాటకుల సందడి



సందడి చేస్తున్న పర్యాటకులు

హుకుంపేట: రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన శిఖరంగా గుర్తింపు పొంది, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న జెండాకొండ (సీతమ్మపర్వతం)కు సోమవారం పర్యాటకులు భారీగా తరలివచ్చి, సందడి చేశారు. ఆదాయపన్ను శాఖ విశాఖ అదనపు కమిషనర్ కె.శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి జెండాకొండను సందర్శించారు. ఆదివారం సాయంత్రం ఓలుబెడ్డా గ్రామానికి చేరుకుని స్థానిక గిరిజనుల సాయంతో కాలినడకన కొండపైకి చేరుకున్నారు. వారితో పాటు పలువురు పర్యాటకులు రాత్రి కొండపైన గుడారాల్లో బసచేసి సోమవారం వేకువజామును పాలసంద్రాన్ని తలపించే మంచు అందాలు, సూర్యోదయాన్ని తిలకించారు. థింసా రాళ్లు, తేనెపట్టు గుహలను చూసి ఫిదా అయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జెండాకొండ అందాలు అద్భుతంగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన శిఖరంగా గుర్తింపు పొందిన ఈ పర్వతాన్ని ఎక్కడం ఆనందంగా ఉందని తెలిపారు. రోడ్డు, మౌలిక సదుపాయలు కల్పిస్తే భవిష్యత్తులో పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.

క్లుప్తంగా

సారా బట్టీలపై పోలీసుల దాడులు

రత్నంపేట శివారులో 2,500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



సారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొయ్యూరు: మండలంలోని రత్నంపేట శివారులో సారా బట్టీలపై సోమవారం సీఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాజారావు బృందం దాడులు చేసి 2,500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసింది. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా సారా తయారవుతుందన్న సమాచారం మేరకు ఎస్‌ఐ తన బృందంతో కలిసి దాడులు చేశారు. బెల్లం పులుపును, సారా తయారీకి ఉపయోగిస్తున్న సామగ్రిని ధ్వంసం చేశారు. టిన్నులు, డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సారా తయారు చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా సారా తయారు చేసి విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు.

కోడి పందాలడుతున్న ఐదుగురి అరెస్టు

దేవీపట్నం: మండలంలోని సి.గంగవరంలో కోడి పందాల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి, ఐదుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ. 2,800 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరిచినట్టు ఆయన చెప్పారు.

శారదానదిలో గుర్తు తెలియని మృతదేహం

మునగపాక: ఉమ్మలాడ శారదానదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు ఆయన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని వయసు 35 సంవత్సరాలలోపు ఉంటుందని, పసుపు రంగు ఫుల్‌షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించామని, వివరాల కోసం స్థానిక పోలీసు స్టేషన్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

టాప్‌గేర్‌లో భూ రీసర్వే

అస్తవ్యస్తంగా మారిన భూముల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు.. సాహసోపేతంగా భూముల రీసర్వే చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సత్ఫలితాలు సాధిస్తోంది. బ్రిటిష్ కాలం నాటి భూముల రికార్డుల స్థానంలో ఆధునిక డిజిటల్ భూ రికార్డులను అందుబాటులోకి తీసుకొస్తోంది. మొదటి రెండు విడతల్లో 34 గ్రామాల్లో విజయవంతంగా సర్వే పూర్తి చేసిన అధికారులు.. మూడు, నాలుగు విడతల్లో 46 గ్రామాల్లో భూ సరిహద్దులతో పాటు గ్రామాలకూ సాంకేతిక హద్దులు గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేశారు.

– సాక్షి, విశాఖపట్నం

- తొలి రెండు విడతల్లో విశాఖ జిల్లాలోని 34 గ్రామాల్లో సర్వే పూర్తి
- ఇప్పటివరకు 49,302 హద్దు రాళ్ల ఏర్పాటు
- మూడు, నాలుగు విడతల్లో 46 గ్రామాల్లో సర్వే
- విశాఖ జిల్లాకు కొత్తగా 13 మంది సర్వేయర్ల కేటాయింపు
- డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు

గ్రామాల్లో భూ తగాదాలు లేకుండా ప్రశాంత పల్లెలుగా విరాజిల్లాలి అనే సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష అనే పథకం తీసుకొచ్చింది. రికార్డుల ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా.. భూ యజమానులకు స్పష్టమైన హక్కు కల్పించడం, అక్షాంశాలు, రేఖాంశాల ద్వారా భూ హద్దులను గుర్తించి ఆ భూమికి రక్షణ కల్పించడమే ధ్యేయంగా విశాఖ జిల్లాలో రీసర్వే జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించి డ్రోన్ సర్వే పూర్తయింది. అయితే.. నౌకాదళ పరిధిలో కొన్ని గ్రామాలుండటం వల్ల రీసర్వేకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ క్రమంలో నేవీ అధికారులతో కలెక్టర్ డా.మల్లికార్జున సంప్రదింపులు జరిపి.. నేవీ పరిధిలోని గ్రామాల్లోనూ డ్రోన్ సర్వేకు అనుమతులు తీసుకొని శరవేగంగా పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఆర్థోరెక్టిఫైడ్ రేడార్ ఇమేజ్(ఓఆర్‌ఐ) మ్యాప్‌ల సహాయంతో సర్వే పనులు జరుగుతున్నాయి. మొదటి విడతలో 11 గ్రామాల్లోనూ, రెండో విడతలో పూర్తయిన 23 గ్రామాల్లో కలిపి మొత్తం 34 గ్రామాల్లో 49,302 వరకు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది.



రీ సర్వేలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

డిసెంబర్ నాటికి పూర్తికి చర్యలు

మూడో విడతలో 40 గ్రామాలు, నాలుగో విడతో స్వల్ప వివాదాలు, సాంకేతిక సమస్యలున్న ఆరు గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అయితే.. సాంకేతిక సమస్యలను పరిష్కరించి.. మూడో విడతలోనే 46 గ్రామాలను పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే 14 గ్రామాల్లో ప్రాథమిక సర్వే పూర్తయింది. మిగిలిన గ్రామాల్లోనూ పూర్తి చేసేలా జోరుగా పనులు నిర్వహిస్తూ.. డిసెంబర్ 31 నాటికల్లా రీసర్వేను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతీ భూమికి సరిహద్దులను జియో ట్యాగింగ్ ద్వారా నిర్ణయిస్తున్నారు. కేవలం నాలుగు దిశల్లో మాత్రమే కాకుండా.. ప్రతీ ప్రాంతంలో ఎన్ని స్థలాలున్నాయో.. ప్రతీ దిశలో ప్రతీ పాయింట్‌కు జియో కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారిలా...

56 మంది సర్వేయర్లతో..



ప్రస్తుతం 43 మంది సర్వేయర్లతో సర్వే నిర్వహిస్తుండటం కొంత ఆలస్యమైంది. అందుకే అదనంగా సర్వేయర్లను కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాశాం. దీనిపై సత్వరమే స్పందించిన ప్రభుత్వం.. అదనంగా 13 మంది సర్వేయర్లని కేటాయించింది. ఇప్పుడు మొత్తం 56 మంది సర్వేయర్లతో 3, 4 విడతల సర్వేను ఏకకాలంలో వేగవంతం చేస్తున్నాం. ఒక్కో వ్యక్తికి ఉన్న భూ సరిహద్దు ఎంత అనే దానికి స్పష్టమైన కోడ్‌ను పొందుపరుస్తున్నాం. ప్రతీ గ్రామంలోని ప్రభుత్వ భూములకు ప్రత్యేక కోడ్‌ను పెడుతున్నాం. వీటితో పాటు ప్రతి గ్రామానికీ జియో కోడ్‌లతో సాంకేతిక సరిహద్దులను ఏర్పాటు చేసే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే మిగిలిన గ్రామాలకు సరిపడిన సరిహద్దు రాళ్లు జిల్లాకు చేరుకున్నాయి. ఓవైపు సర్వే నిర్వహిస్తూ.. మరోవైపు రాళ్ల ఏర్పాటు ప్రక్రియను సమాంతరంగా చేపడుతున్నాం.

– కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్

భక్తిశ్రద్ధలతో నృసింహ హోమం

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజు సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా తొలిసారి టికెట్లు అందుబాటులో ఉంచడంతో 50 మంది దంపతులు హోమంలో పాల్గొని తరించారు. తొలుత చక్రపెరుమాళ్లను ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి హోమగుండం వద్ద అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలతో స్వామివారి అష్టోత్తరనామావళి పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా తిరునక్షత్రం పూజలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు జరగనున్న మనవాళ్ మహా మునులు తిరునక్షత్రం పూజలను ఆదివారం పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆలయ వైదికులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర

కొమ్మాది: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన గురునాథ్ యాదవ్ చేపట్టిన పాదయాత్ర సోమవారం విశాఖపట్నం చేరుకుంది. శ్రీకాకుళం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు ఈ పాదయాత్ర సాగనుంది. ఇందులో భాగంగా సోమవారం గురునాథ్ ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. అనంతరం గురునాథ్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ సీఎం వైఎస్ జగన్ ముందుగు సాగుతున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుతం జగనన్న సుపరిపాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తూ ఈ పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని, అందుకు శ్రీవేంకటేశ్వరస్వామి దీవెనలు ఉండాలని వేడుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకటరావు, రవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గురునాథ్ యాదవ్‌ను సత్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

16న మైనార్టీ కమిషన్ రాక

మహారాణిపేట: రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్, వైస్ చైర్మన్ ఆదిపి జాషువా డేనియల్, సభ్యులు సయ్యద్ హిదయతుల్లా, షేక్ సైపుల్లా, జితేందర్ సింగ్ ఈ నెల 16న విశాఖ రానున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనుల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషన్ చైర్మన్ ఇక్బాల్ ఒక ప్రకటనలో కోరారు.

రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు



రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న రైల్వేబోర్డు అడిషనల్ మెంబర్ సీమాకుమార్

తాటిచెట్లపాలెం: రైల్వే బోర్డు, అడిషనల్ మెంబర్(టూరిజం అండ్ కేటరింగ్), ఐఆర్‌సీటీసీ సీఎండీ సీమాకుమార్ సోమవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో పర్యటించారు. అనంతరం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, గతిశక్తి ఉన్నతాధికారులతో సమావేశమై స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనుల వల్ల ప్రయాణికులకు, రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం ఐఆర్‌సీటీసీ అధికారులతో సమావేశమై తదుపరి తీసుకోవలసిన అభివృద్ధి చర్యల గురించి చర్చించారు. ఆమెతోపాటు డీఆర్‌ఎం, స్టేషన్ డైరెక్టర్, డివిజన్ ఉన్నతాధికారులు ఉన్నారు.

కూరగాయలకు గిరాకీ

సంతలో జోరుగా వ్యాపారం

పెదబయలు: పెదబయలు వారపు సంతల్లో సోమవారం ఒడిశా కూరగాయల అమ్మకం ఎక్కువగా జరుగుతుంది. సంతలో 80 శాతం కూరగాయాల వ్యాపారం జరుగుతుంది. ఒడిశా జైపూర్, జగదల్‌పూర్, చత్తీస్‌ఘడ్‌ను ఆనుకుని సరిహద్దు ప్రాంతాల నుంచి కూరగాయాలు పెదబయలు సంతకు తెచ్చి అమ్మకాలు చేస్తున్నారు. వ్యాన్లు, లారీల్లో విడివిడిగా అన్ని రకాల కూరగాయాలు తెచ్చి విక్రయిస్తున్నారు. గతంలో 80 శాతం కూరగాయలు పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల నుంచి మాలీ రైతులు తెచ్చి అమ్మకం చేసే వారు. మైదాన ప్రాంతం అనకాపల్లి నుంచి తెచ్చి అమ్మకం చేస్తే వారు అయితే ఒడిశా నుంచి పెద్ద ఎత్తున కూరగాయలు తెచ్చి అమ్మకంతో ఈ ప్రాంతాల నుంచి దిగుబడి తగ్గింది. ఒడిశా నుంచి వచ్చే కూరగాయలు గ్రేడింగ్ చేసి పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి 10, 15, 20 కిలోల చొప్పున విడి విడిగా ప్యాక్ చేసి తెచ్చి అమ్మకం చేస్తున్నారు. ఒక్క ప్యాకెట్ రూ.400 నుంచి రూ.1000 వరకు కూరగాయల అనుగుణంగా ధర పలుకుతుంది. దీంతో ఇప్పటి వరకు కూరగాయలు పండించి అమ్మకం చేస్తున్న మాలీ రైతులు సైతం వీరి దగ్గరే కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్నారు. అనకాపల్లి ప్రాంతాల నుంచి కంటే ఒడిశా కూరగాయలు ధర కొంత తక్కువగా ఉన్నట్టు చిరువ్యాపారులు తెలిపారు. పెదబయలు వారపు సంతలో గిరిజన రైతులు పండించిన బస్తర్లు కిలో రూ.100 ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు. సంతకు ఎక్కువ సరుకు వస్తే రైతులు సిండికేట్‌గా మారి ఒక్కసారిగా ధర తగ్గిస్తున్నారు. ఒక్క వారంలోనే కిలోకు రూ.30 ధర తగ్గించారు. దీంతో సంతకు తెచ్చిన సరుకు తిరిగి తీసుకుని వెళ్లే అవకాశం లేక వారు నిర్వహించిన ధరకే రైతులు అమ్మకాలు చేశారు. అలాగే వేరుశనగలు అమ్మకం చేశారు. బస్తా రూ.1300 నుంచి రూ.1500 వరకు కొనగోలు చేశారు.



సంతకు వ్యాన్‌లో తీసుకొచ్చిన కూరగాయలు

ఘనంగా నరకాసుర వధ

సింహాచలం: నరకచతుర్దశి, దీపావళి సందర్భంగా సింహగిరిపై ఆదివారం రాత్రి నరకాసుర వధ ఉత్సవం ఘనంగా జరిగింది. రాత్రి ఆరాధన అనంతరం ఆలయ వైదికులు.. సింహాద్రి అప్పన్న స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఒక పల్లకిలో, నరకాసురుడి విగ్రహాన్ని మరో పల్లకిలో మాడ వీధుల్లోకి తిరువీధిగా తీసుకొచ్చారు. నరకాసురుడు, స్వామి ఉత్సవమూర్తుల పల్లకీలను ఎదురుఎదురుగా ఉంచి యుద్ధ సన్నివేశాలు నిర్వహించారు. తరువాత నరకాసుర వధ జరిపారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



నరకాసురుడి వధ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

రైలు పట్టాలపై మృతదేహం



మజ్జి బాబూరావు (ఫైల్)

యలమంచిలి(అనకాపల్లి రూరల్): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే యార్డు పక్కనున్న రైలు పట్టాలపై సోమవారం వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల క్రితమే చనిపోయి ఉండవచ్చని తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. స్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి వద్ద బ్యాగులో లభించిన ఆధార్ కార్డు వివరాల మేరకు కశింకోట మండలం, నర్సింగబిల్లికి చెందిన మజ్జి బాబూరావు(40)గా గుర్తించారు. ప్రమాదవశాత్తూ ప్లాట్‌ఫాం పైనుంచి జారిపడి, పట్టాలపై ఉన్న రాళ్లు తలకు తగిలి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే యార్డు పక్కనున్న ఈ ప్లాట్‌ఫాం పూర్తిగా పొదల మధ్య ఉండటంతో దుర్వాసన వస్తేగానీ మృతదేహం ఉన్నట్లు తెలియలేదు. మృతుని వద్ద రెండు మొబైల్ ఫోన్లు కూడా ఉన్నాయి. మోకాళ్లపై చిన్న గాయాలున్నాయి. మృతుని కుటుంబీకులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ మారూఫ్ తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వాస్పత్రిలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు.



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్

భరోసా.. బాధ్యత

- విద్య, వసతి దీవెన పంపిణీలో మరింత పారదర్శకత
- ఇప్పటి వరకు విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బులు
- ఇక నుంచి స్టూడెంట్–తల్లి జాయింట్ అకౌంట్
- ఈ నెల 24 నాటికి జాయింట్ ఖాతాలు తెరిచేలా ఏర్పాట్లు
- ఈ నెల 28న బ్యాంకు ఖాతాల్లో విద్యాదీవెన డబ్బులు

విశాఖ విద్య: జగనన్న విద్య, వసతి దీవెన పథకం మరింత పారదర్శకంగా అమలు చేసేలా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటి వరకు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుండగా, ఇక నుంచి విద్యార్థి జాయింట్ అకౌంట్‌లో డబ్బులు పడనున్నాయి. నిరుపేద వర్గాల ఉన్నత చదువులకు అండగా నిలవాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న జగనన్న విద్య, వసతి దీవెన పథకం ప్రయోజనం ద్వారా విద్యార్థుల బాధ్యతను పెంచేలా ఇటువంటి మార్పులకు శ్రీకారం చుట్టారు. డిప్లమో, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే అర్హులైన నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అమలు చేస్తోంది. ఇది పేదవర్గాల పిల్లలకు ఎంతో ఆర్థిక భరోసాగా నిలుస్తోంది.

విశాఖ జిల్లాలో 27,781 మంది లబ్ధిదారులు

విశాఖ జిల్లాలో 27,781 మంది విద్యార్థులు జగనన్న విద్య, వసతి దీవెన పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. వీరిలో గ్రేటర్ విశాఖ మండలం పరిధిలో 24,109 మంది విద్యార్థులున్నారు. భీమిలి మండలంలో 667 మంది, ఆనందపురంలో 902 మంది, పెదగంట్యాడలో 701 మంది, పెందుర్తి మండలంలో 593 మంది విద్యార్థులు ప్రయోజనం అందుకుంటున్నారు.

ఆ ఐదు బ్యాంకుల్లోనే అత్యధికం..

జిల్లాలో 27,781 మంది విద్యార్థులు జగనన్న విద్య, వసతి దీవెన పథకం ప్రయోజనం పొందేందుకు అర్హులని లెక్క తేల్చారు. వీరిలో 27,310 మందికి బ్యాంకుల్లో అకౌంట్లు ఉన్నట్లు గుర్తించారు. అత్యధికంగా స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో 9,028 మంది అకౌంట్లు కలిగి ఉన్నారు. అదే విధంగా యూనియన్ బ్యాంకులో 6,540 అకౌంట్లు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులో 4,974, బ్యాంకు ఆఫ్ ఇండియాలో 2,044, కెనరా బ్యాంకులో 1,847 మంది అకౌంటు కలిగి ఉన్నారు. మరో ఏడు బ్యాంకుల్లో వంద నుంచి ఏడు వందల లోపు అకౌంట్లు, మరో 23 బ్యాంకుల్లో వందలోపు చొప్పునే అకౌంట్లు ఉన్నాయి.

లక్ష్యం సాధించేలా..

విశాఖ జిల్లాలో జగనన్న విద్య, వసతి దీవెన పొందుతున్నవారికి ఇప్పటికే వారి తల్లి పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. ఇదే ఖాతాకు విద్యార్థి పేరుతో జాయింట్ అకౌంట్‌గా మార్పు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసమని బ్యాంకు అధికారులను సమన్వయం చేసుకునేలా సంక్షేమ శాఖలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ నెల 28న 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా దీవెన డబ్బులు జమ కానున్నాయి. ఈ లోగానే జాయింట్ బ్యాంకు ఖాతాలు ప్రక్రియ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం

విద్యార్థి, తల్లి పేరుతో జాయింట్ బ్యాంకు ఖాతాలు తెరిపించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 24 నాటికి లక్ష్యం పూర్తి చేసేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. విశాఖ జిల్లాలోని ప్రతీ కాలేజీకి ఓ హెచ్‌డబ్ల్యూవోను బాధ్యుడిగా చేసి, దీనిని ఏఎస్‌డబ్ల్యూవో/ఏటీడబ్ల్యూవోలను పర్యవేక్షణ అధికారులుగా నియమించాం. జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచనలకు అనుగుణంగా బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నాం.

– కె.రామారావు, డిప్యూటీ డైరెక్టర్, విద్యా, వసతి దీవెన విశాఖ జిల్లా నోడల్ అధికారి

పుస్తకం విలువ చాటేలా..!

- నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు
- 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

డాబాగార్డెన్స్/విశాఖ విద్య: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్.వెంకటరావు తెలిపారు. వారోత్సవాల ప్రచార పోస్టర్లు, బ్యానర్స్, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వివరాలను వెల్లడించారు. విశాఖ నగరంలోని సూర్యబాగ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయం వేదికగా వారోత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు

వారోత్సవాల షెడ్యూల్ ఇదీ...

- ఈ నెల 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తారు.
- 15న పుస్తక ప్రదర్శనతోపాటు మాదక ద్రవ్యాల నిరోధకంపై అవగాహన కార్యక్రమం, పుస్తక పఠనం ప్రాముఖ్యతపై సెమినార్ నిర్వహించనున్నారు.
- 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం, గ్రంథాలయ ఉద్యమ నాయకులు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథం, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం తదితరులకు నివాళులర్పించుట, గ్రంథ పాలకుల సదస్సు నిర్వహించనున్నారు.
- 17న సాయంత్రం గరిమ సాంస్కృతిక వేదిక సారథ్యంలో కవి సమ్మేళనం.
- 18న గ్రంథాలయ సభ్యత్వ దరావతు స్వీకరణ. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఆటలు, దేశభక్తి గేయాల పోటీలు.
- 19న ఉదయం 10 గంటలకు గరిమ సాంస్కృతిక వేదిక సారథ్యంలో మహిళా దినోత్సవం నిర్వహణ. దిశ చట్టం, మహిళా సాధికారితపై సదస్సు.
- 20న సామూహిక స్వీయ పుస్తక పఠనం, అనంతరం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహిస్తారు.

నేడు వారోత్సవాలు ప్రారంభం

గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభించనున్నామని, బాలల దినోత్సవం, జాతీయ పతాకావిష్కరణ నిర్వహించనున్నట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సి.హెచ్. వెంకటరావు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, వయోజన విద్యాశాఖ సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం, జిల్లా పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు వి.మణిరామ్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు, ఉప గ్రంథాలయ అధికారి నూకరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా గ్రంథాలయ కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న వెంకటరావు, తదితరులు